సాక్షి
పశ్చిమగోదావరి

సోమవారం । 3 । జూన్ । 2024



ఆక్వా కుదేలు

ఆక్వా సాగును నిషేధిత మందులు కలుషితం చేస్తున్నాయి. అవగాహన లేని ఆక్వా రైతులను దుకాణదారులు నట్టేట ముంచుతున్నారు.

8లో



వైభవంగా చక్రస్నానం

పారిజాతగిరి శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాలలో ఆదివారం సుదర్శన పెరుమాళ్‌కు చక్రస్నాన మహోత్సవం నిర్వహించారు.

8లో



ఏజెంట్ల పాత్ర కీలకం

కౌంటింగ్‌లో ఏజెంట్లు కీలక పాత్ర పోషించనున్నారు. ఈ నేపథ్యంలో నిబంధనలపై వారు అవగాహన పెంచుకోవాలని విశ్లేషకులు వెల్లడిస్తున్నారు.

8లో

న్యూస్‌రీల్

తణుకు నియోజకవర్గానికి ప్రత్యేక ఎస్పీ



పి.శ్రీనివాస్

తణుకు : సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో తణుకు నియోజకవర్గానికి ప్రత్యేక ఎస్పీను ఉన్నతాధికారులు నియమించారు. ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో నియోజకవర్గంలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా నిత్యం పర్యవేక్షించడానికి తిరుపతి ఎర్రచందనం టాస్క్‌ఫోర్స్ ఎస్పీ పి.శ్రీనివాస్‌ను తాత్కాలికంగా నియమించారు. ఈనెల 6న ఎన్నికల కోడ్ ముగిసే వరకు ఆయన తణుకు నియోజకవర్గ ప్రత్యేక ఎస్పీగా వ్యవహరిస్తారు.

ఘనంగా గోగులమ్మ జాతర



యర్రంశెట్టిపాలెంలో గోగులమ్మ ఆలయంలో కోలాటం ప్రదర్శన

నరసాపురం రూరల్ : మండలంలోని యర్రంశెట్టివారిపాలెంలో గత రెండు రోజులుగా నిర్వహిస్తున్న గోగులమ్మ అమ్మవారి జాతరలో ఆదివారం అమ్మవారికి మొక్కుబడులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన వివిధ ప్రాంతాల్లో నివసిస్తున్న ఆడపడుచులు పెద్దఎత్తున వచ్చి నైవేద్యాలు సమర్పించుకున్నారు. జాతరను పురస్కరించుకుని ఏర్పాటు చేసిన కోలాటం, గరగ నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఆలయ ప్రాంగంణంలో ఓం శాంతి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శివలింగాలను భక్తులు సందర్శించారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి



చింతలపూడి సబ్ జైలులో కేసుల వివరాలను పరిశీలిస్తున్న ఉమ్మడి జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తం కుమార్

చింతలపూడి: చింతలపూడి సబ్ జైలును ఉమ్మడి జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తం కుమార్ ఆదివారం సందర్శించారు. సబ్ జైలులో ముద్దాయిలకు అందిస్తున్న ఆహారం, వసతి సదుపాయాల గురించి జైలు అధికారులను ఆరా తీశారు. ఈ సందర్భంగా ఖైదీలకు చట్టాలపై అవగాహన కల్పించారు. క్షణికావేశంలో నేరాలకు పాల్పడి శిక్ష అనుభవించాక సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. ప్రతి ఒక్కరూ హింసా మార్గాన్ని విడనాడాలని పిలుపునిచ్చారు. స్తోమత లేక న్యాయవాదిని పెట్టుకోలేని వారి కోసం న్యాయవాదిని లీగల్ సర్వీసెస్ అథారిటీ ఏర్పాటు చేస్తుందని తెలిపారు. సబ్‌జైలు ప్రాంగణంలో ఉచిత న్యాయ సహాయ కేంద్రాన్ని వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి సి.మధుబాబు, జిల్లా సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్న ప్రసాద్, సోషల్ వర్కర్ ఎండీ అక్బర్ అలీ, న్యాయవాదులు ఏసుపాదం, పింగుల డేవిడ్ రాజు, ఉమర్ ఫరూఖ్, పారా లీగల్ వలంటీర్ ఎండీ అక్బర్ అలీ, జైలు సూపరింటెండెంట్ జి.వెంకటేశ్వరావు, సబ్‌జైలు సిబ్బంది పాల్గొన్నారు.

రెండో విడత ర్యాండమైజేషన్



అధికారులకు సూచనలిస్తున్న జిల్లా కలెక్టరు సుమిత్ కుమార్

భీమవరం (ప్రకాశంచౌక్) : కౌంటింగు అధికారులకు, సిబ్బందికి రెండో విడత ర్యాండమైజేషన్ పక్రియను కౌంటింగు పరిశీలకులు ఎం.దీప, ఎల్.నిర్మల రాజ్, బి.డి.కుమావత్ సమక్షంలో పూర్తి చేశామని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టరు సుమిత్ కుమార్ తెలిపారు. ఆదివారం జిల్లా కలెక్టరేటు వశిష్ఠ కాన్ఫరెన్స్‌లో రెండో విడత ర్యాండమైజేషన్‌ను కలెక్టరు పూర్తి చేశారు. నరసాపురం పార్లమెంటు, అసెంబ్లీ నియోజకవర్గాల ఈవీఎంలు, పోస్టల్ బ్యాలెట్లు లెక్కించేందుకు, పర్యవేక్షించేందుకు కౌంటింగు సూపర్ వైజర్లు, కౌంటింగు అసిస్టెంట్లు, మైక్రో అబ్జర్వర్లు రిజర్వుడు స్టాఫ్‌తో కలిపి మొత్తం 959 మందికి సంబంధించి ర్యాండమైజేషన్ నిర్వహించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టరు, ఉండి నియోజకవర్గం ఆర్వో సి.వి.ప్రవీణ్ ఆదిత్య, జిల్లా రెవెన్యూ అధికారి జె.ఉదయ భాస్కరరావు, డ్వామా పీడీ ఎం.ప్రభాకర రావు, తదితరులు పాల్గొన్నారు.

డెల్టాలో తేనెటీగల పెంపకం

గోదావరి డెల్టా ఏరియాలో నయా ట్రెండ్

- ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం.. ముందుకు వస్తున్న ఔత్సాహికులు
- గత ఐదేళ్లలో వివిధ జిల్లాల నుంచి 380 మంది వరకు శిక్షణ
- ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో సబ్సిడీపై కిట్ల పంపిణీ
- భీమవరం, కోనసీమ ప్రాంతాల్లో 800కు పైగా బాక్సుల ఏర్పాటు

సాక్షి, భీమవరం: ఏజెన్సీ, మెట్ట ప్రాంతాల్లో ఎక్కువగా కనిపించే తేనెటీగల పెంపకం గోదావరి డెల్టాకు విస్తరిస్తోంది. నయా ట్రెండ్‌గా ఔత్సాహికులు కొబ్బరి, కూరగాయల తోటల్లో వీటిని పెంచుతున్నారు. కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు, ఉద్యాన వన శాఖ అధికారులు ఆసక్తి కలిగిన వారికి శిక్షణతో పాటు వీటి పెంపకాన్ని ప్రోత్సహిస్తూ ప్రభుత్వ సబ్సిడీలు అందిస్తున్నారు. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లోని కోనసీమ, భీమవరం ప్రాంతాల్లో 800కు పైగా బాక్సుల్లో వీటి పెంపకం సాగిస్తున్నారు.

పర్యావరణ సమతుల్యతను కాపాడటంలో కీలక పాత్ర...

పర్యావరణ సమతుల్యతను కాపాడటంలో తేనెటీగల పాత్ర కీలకం. ఆరోగ్యానికి మేలు చేస్తూ అనేక పోషక విలువలు కలిగిన తియ్యని తేనెను అందించడమే కాకుండా పరపరాగ సంపర్కం ద్వారా పంటలకు ఇవి చేసే మేలు అంతా ఇంతా కాదు. తేనె, తేనె ఉత్పత్తులకు మార్కెట్‌లో గిరాకీ పెరుగుతుండటంతో తేనెటీగల పెంపకం లాభసాటి పరిశ్రమగా మారింది. ఉద్యానవన, పండ్ల తోటలున్న విశాఖ మన్యం, ఏజెన్సీ ప్రాంతాల్లో వీటి పెంపకం ఎక్కువగా కనిపిస్తుంది. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో మెట్ట, ఏజెన్సీ ప్రాంతాల్లో విస్తరించి ఉన్న తాడేపల్లిగూడెం, ఏలూరు, రాజమహేంద్రవరం, రంపచోడవరం, తుని, గోకవరం పరిసర ప్రాంతాల్లోనూ రెండు వేలకు పైగా బాక్సుల్లో వీటి పెంపకం చేస్తున్నారు. వరి పండే చోట మాత్రం వీటి సంచారం తక్కువగా ఉంటుంది. ఆ కారణంతోనే గోదావరి డెల్టా ప్రాంతమైన భీమవరం, కోనసీమ ప్రాంతాల్లో తేనెటీగల పెంపకానికి ఎవరూ పెద్దగా ఆసక్తి చూపించడం లేదు.

ఔత్సాహికులకు శిక్షణ, ప్రోత్సాహం

జీవ వైవిధ్యాన్ని, పర్యావరణాన్ని జీవవంతం చేస్తున్న తేనెటీగల మనుగడను పంటల్లో రసాయనిక పురుగు మందుల వినియోగం దారుణంగా దెబ్బతీస్తోంది. పర్యావరణ పరిరక్షణలో భాగంగా తేనెటీగల పెంపకాన్ని ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది.



భీమవరం సమీపంలోని కొబ్బరి తోటల్లో తేనెటీగల కాలనీ

కృషి విజ్ఞాన కేంద్రా(కేవీకే)ల ద్వారా ఔత్సాహికులకు శిక్షణ ఇస్తున్నారు. ఉండిలోని కేవీకే వద్ద గత ఐదేళ్లలో వివిధ జిల్లాలకు చెందిన 380 మందికి తేనెటీగల పెంపకంలో శిక్షణ, అవగాహన కల్పించారు. వీరిలో గోదావరి డెల్టా ప్రాంతానికి చెందిన పలువురు ఔత్సాహికులు ఉన్నారు.

శిక్షణ పొందినవారికి ప్రభుత్వ సబ్సిడీ

శిక్షణ పొందిన వారికి తేనెటీగల పెంపకం నిమిత్తం సబ్సిడీ రూపంలో ప్రభుత్వం అవసరమైన ప్రోత్సాహం అందిస్తోంది. ఒక తేనెటీగల బాక్స్‌లోని ఎనిమిది అరల్లో 20 వేల నుంచి 40 వేలకు పైగా తేనెటీగలు ఉంటాయి. బాక్స్, ఫీడర్, స్టాండ్ ఒక కిట్ కాగా.. మార్కెట్‌లో దీని విలువ రూ.3200 నుంచి రూ.3800 వరకు ఉంటుంది. ప్రభుత్వం ఉద్యానవన శాఖ ద్వారా ఒక బాక్స్‌కు



భీమవరం ప్రాంతంలో సేకరించిన తేనె

రూ.1600 సబ్సిడీ అందజేస్తోంది. ఎనిమిది బాక్సులను ఒక తేనెటీగల కాలనీగా పరిగణిస్తూ వీటిని రూ.12,800 అందజేస్తోంది. ఈ విధంగా ఒక్కొక్కరికి 50 బాక్సుల వరకు రూ.80 వేలు సబ్సిడీపై అందిస్తోంది. తేనె సేకరించేందుకు అవసరమైన సామగ్రి విలువ రూ.20 వేల వరకు ఉండగా రూ.8000 సబ్సిడీగా ఇస్తోంది.



బాక్సులోని ఫ్రేంకు తేనెపట్టును సిద్ధం చేస్తున్న తేనెటీగలు

కొబ్బరి తోటల్లో తేనెపట్టులు

గోదావరి డెల్టాలోని కొబ్బరి తోటలు, గోదావరి పరీవాహక లంకల్లోని కూరగాయలు, పూల తోటలు తేనెటీగల పెంపకానికి అనువుగా ఉండటంతో ఔత్సాహికులు ముందుకు వస్తున్నారు. ప్రభుత్వ సబ్సిడీతో కొందరు వ్యాపారాత్మక ధోరణిలోను, మరికొందరు సరదాగా పెంచుతున్నట్టు అధికారులు చెబుతున్నారు. ఉద్యానవన శాఖ లెక్కల ప్రకారం భీమవరం, పాలకొల్లు, వీరవాసరం, పోడూరు, నరసాపురం, కోనసీమలోని అయినవిల్లి, పి.గన్నవరం మండలాల్లో 800కు పైగా బాక్సుల్లో వీటిని పెంచుతున్నట్టు అంచనా. వీరిలో ప్రభుత్వ సబ్సిడీతో పెంచుతున్నవారు ఎక్కువమంది ఉన్నారు. ఒక్కో తేనె బాటిల్ కిలో రూ.450 నుంచి రూ.500కు విక్రయిస్తున్నారు. తేనెటీగలు సేకరించే పుప్పొడిని కూడా వేరు చేసి విక్రయిస్తారు. దీనిలో హై ప్రొటీన్ ఉండటంతో కిలో రూ.2000 వరకు వస్తుంది. సీజన్‌ను బట్టి కొబ్బరి తోటలు, కూరగాయలు, పూల తోటల్లో ఉంచి అన్ సీజన్‌లో వేరే ప్రాంతానికి తీసుకువెళ్లి పెంచుతుంటారు. ఏడాది క్రితం కేవీకేలో శిక్షణ తీసుకుని 30 బాక్సుల్లో తేనెటీగల పెంపకం ప్రారంభించామని, మొదట్లో కొన్ని ఇబ్బందులు ఎదురైనా ఇప్పుడు లాభసాటిగా ఉందని పాలకొల్లు సమీపంలోని వేండంగిపాలేనికి చెందిన పెంపకందారులు అంబేడ్కర్, నాగరాజు తెలిపారు. 45 రోజుల్లో ఒక్కో బాక్సు నుంచి మూడు బాటిళ్ల తేనెను సేకరిస్తున్నామని, ఒక్కో బాటిల్ రూ.500 వరకు విక్రయిస్తున్నామని వివరించారు.

ఔత్సాహికులకు శిక్షణ



ఇటీవల గోదావరి డెల్టా ప్రాంతంలో తేనెటీగల పెంపకం పెరిగింది. ఔత్సాహికులు ముందుకు వచ్చి శిక్షణ తీసుకుంటున్నారు. ఉండి కేవీకే ఆధ్వర్యంలో గత ఐదేళ్లలో 380 మందికి శిక్షణ, అవగాహన కార్యక్రమాలు నిర్వహించాం. ప్రభుత్వపరంగా వారికి ప్రోత్సాహం అందిస్తున్నాం.

– డీఆర్‌ఎం మల్లిఖార్జునరావు, ఉండి కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్, హెడ్

గోదావరి డెల్టాలోనూ బాగా పెంచుతున్నారు



ఇటీవల కాలంలో డెల్టా ప్రాంతమైన భీమవరం, కోనసీమ ప్రాంతాల్లో తేనెటీగల పెంపకం బాగా పెరిగింది. వ్యాపార పరంగా, హాబీగా కొందరు ఔత్సాహికులు ముందుకు వచ్చి వీటిని పెంచుతున్నారు. గత రెండేళ్లలో డెల్టాతో పాటు ఉభయ గోదావరి జిల్లాల్లో వెయ్యి వరకు బాక్సులు అందజేశాం.

– ఎంఎస్ రాజు, వశిష్ట హనీ నేచురల్స్, భీమవరం

నేత్రపర్వంగా సువర్చలా హనుమద్ కల్యాణం



స్వామి వారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



కల్యాణ అలంకరణ

జంగారెడ్డిగూడెం రూరల్: గురవాయిగూడెం శ్రీమద్ది ఆంజనేయస్వామి క్షేత్రంలో జరుగుతున్న హనుమజ్జయంతి ఉత్సవాల్లో ఆదివారం సువర్చలా హనుమద్ కల్యాణం నేత్రపర్వంగా నిర్వహించారు. భక్తులు స్వామి కల్యాణాన్ని కనులారా వీక్షించారు. వేద పండితులు, అర్చకులు స్వామి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ ఈవో ఆకుల కొండలరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు. విజయవాడకు చెందిన ప్రసాద రావు బృందంచే భక్తి సంగీత విభావరీ కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఉత్సవాల్లో నేడు

మద్దిలో హనుమజ్జయంతి ఉత్సవాల్లో భాగంగా



స్వామి వారి దర్శనం కోసం క్యూలైన్‌లో బారులు తీరిన భక్తులు

ఈ నెల 3న స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని ఈవో కొండలరావు తెలిపారు. ఉపాలయంలోని శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానంలో శ్రీనివాసుడి కల్యాణం నిర్వహిస్తామన్నారు.

కౌంటింగ్‌లో అప్రమత్తంగా ఉండాలి



జూమ్ వీడియో సమావేశంలో పాల్గొన్న డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ, అప్పడా వైస్ చైర్మన్ వద్ది రఘురాం తదితరులు

తాడేపల్లిగూడెం: కౌంటింగ్‌లో అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ సీఎం, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ కోరారు. వైఎస్సార్ సీపీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన జూమ్ మీటింగ్ సందర్భంగా ఆదివారం పట్టణంలోని పార్టీ క్యాంపు కార్యాలయంలో ఆయన మాట్లాడారు. సజ్జల సూచించిన విధంగా కౌంటింగ్‌లో ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలన్నారు. పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపులో అప్రమత్తత పాటించాలన్నారు. ఓట్ల లెక్కింపు కేంద్రంలో ప్రతి టేబుల్ దగ్గర ఉండే ఏజెంట్లు ఆ టేబుల్ మీద లెక్కించే ఓట్లకు సంబంధించి ప్రతి ఓటు నమోదు చేసుకోవాలన్నారు. వ్యవస్థలను మేనేజ్ చేసే అలవాటు ఉన్న చంద్రబాబు కుట్రలు, కుతంత్రాలను తిప్పి కొట్టాలన్నారు.

కౌంటింగ్ కేంద్రాల పరిశీలన

భీమవరం: కౌంటింగ్ ప్రక్రియలో ప్రతి ఒక్కరు ఎన్నికల కమిషన్ నియమ నిబంధనలను కచ్చితంగా పాటిస్తూ బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకురాలు ఎం.దీప తెలిపారు. ఆదివారం స్థానిక ఎస్ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటుచేసిన ఉండి, భీమవరం, తాడేపల్లిగూడెం నియోజకవర్గాల కౌంటింగ్ కేంద్రాలను జిల్లా కలెక్టర్‌తో సుమిత్ కుమార్‌తో కలిసి ఎం.దీప పరిశీలించారు. కౌంటింగ్ కేంద్రంలో ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలన్నారు.

కౌంటింగ్‌కు సర్వం సిద్ధం

కలెక్టర్ సుమిత్‌కుమార్

భీమవరం: సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపునకు సర్వం సిద్ధం చేసినట్లు కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి సుమిత్ కుమార్ తెలిపారు. ఆదివారం కలెక్టరేట్‌లోని ఎస్పీ వేజెండ్ల అజితతో కలిసి విలేకరులతో మాట్లాడారు. భీమవరం, ఉండి, తాడేపల్లిగూడెం నియోజకవర్గాలకు సంబంధించి ఎస్ఆర్‌కెఆర్ కళాశాల, ఆచంట, పాలకొల్లు, నర్సాపురం, తణుకు నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు విష్ణు కళాశాలలో జరుగుతుందన్నారు. జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 14,72,923 మంది ఓటర్లు ఉండగా పురుషులు 7,21,532 మంది, స్త్రీలు 7,51,313 మంది ఇతరులు 78 మంది ఉన్నారన్నారు. వీరిలో 12,16,558 మంది ఓటు హక్కును వినియోగించుకోగా వారిలో పురుషులు 6,02,480 మంది, స్త్రీలు 6,14,031 మంది, ఇతరులు 47 మంది ఉన్నారని కలెక్టర్ వివరించారు. భీమవరంలో పురుషులు 99,174 మంది, స్త్రీలు 1,01,656 మంది, ఇతరులు 27 మంది, ఆచంటలో పురుషులు 73,024 మంది, స్త్రీలు 76,022 మంది, ఇతరులు ఇద్దరు, పాలకొల్లులో పురుషులు 79,802 మంది, స్త్రీలు 80,684 మంది, ఇతరులు ముగ్గురు, నర్సాపురంలో పురుషులు 72,598 మంది, స్త్రీలు 71,227 మంది ఓటు వేశారు. ఉండిలో పురుషులు 96,695 మంది, స్త్రీలు 97,025 మంది, ఇతరులు ఇద్దరు ఓటు హక్కును వినియోగించుకున్నారు. తణుకులో పురుషులు 93,979 మంది, స్త్రీలు 98,644 మంది, ఇతరులు నలుగురు ఓట్లు వేశారని కలెక్టర్ తెలిపారు. తాడేపల్లిగూడెంలో పురుషులు 87,208 మంది, స్త్రీలు 88,773 మంది ఇతరులు 9 మంది ఓట్లు వేశారని చెప్పారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎస్పీ అజిత

మొత్తం 13,345 పోస్టల్ బ్యాలెట్లు

జిల్లాలో 13,345 పోస్టల్ బ్యాలెట్లు వినియోగించుకోగా భీమవరంలో 2,598, ఆచంటలో 1,430, పాలకొల్లులో 2,143, నరసాపురంలో 1,566, ఉండిలో 1,631, తణుకులో 2,082, తాడేపల్లిగూడెంలో 1,895 మంది పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకున్నట్లు తెలిపారు. నరసాపురం పార్లమెంటరీ నియోజకవర్గానికి సంబంధించి 14 టేబుల్స్ పోస్టల్ బ్యాలెట్స్‌కు, ఒక టేబుల్ ఈటీపీబీఎస్ ఓట్ల లెక్కింపునకు వినియోగిస్తారు. ఏడు నియోజకవర్గాలకు సంబంధించి నాలుగు టేబుల్స్ పోస్టల్ బ్యాలెట్స్‌కు, ఆర్వో టేబుల్‌పై ఈటీపీబీఎస్ ఓట్ల లెక్కింపు కౌంటింగ్ హాళ్లలో నిర్వహిస్తారన్నారు. పార్లమెంట్ నియోజకవర్గానికి 14 టేబుల్స్, అసెంబ్లీ నియోజకవర్గానికి 14 టేబుల్స్ చొప్పున ఏడు నియోజకవర్గాల కౌంటింగ్ జరుగుతుందన్నారు. ఓట్ల లెక్కింపునకు మొత్తం 1,044 మందిని ఏర్పాటుచేయగా వారిలో 265 మంది కౌంటింగ్ సూపర్‌వైజర్లు, 431 మంది కౌంటింగ్ అసిస్టెంట్లు, 297 మంది మైక్రో అబ్జర్వర్లు, 52 మంది ఏఆర్‌ఓఎస్‌గా విధులు నిర్వర్తిస్తారని, 20 మంది చీఫ్ ఎలక్షన్ ఏజెంట్స్, 147 మంది కౌంటింగ్ ఏజెంట్స్‌ను వివిధ రాజకీయ పార్టీల తరపున నియమించినట్లు చెప్పారు.

ఎన్నికల పరిశీలకులు వీరే

ఎస్ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ కళాశాల కౌంటింగ్ కేంద్రాల్లోని భీమవరం, ఉండి, తాడేపల్లిగూడెం నియోజకవర్గాలకు ఐఏఎస్ అధికారిణి ఎం.దీపా కౌంటింగ్ పరిశీలకురాలిగా వ్యవహరిస్తారు. విష్ణు కళాశాలలోని ఆచంట, పాలకొల్లు నియోజకవర్గాలకు బన్షిధర్ కుమవాట్, నరసాపురం, తణుకు నియోజవర్గాలకు ఎల్.నిర్మల్‌రాజ్ కౌంటింగ్ పరిశీలకులుగా వ్యవహరిస్తారు.

ఓట్ల లెక్కింపు సందర్భంగా ప్రశాంతతకు భంగం కలిగిస్తే ఉపేక్షించేది లేదని ఎస్పీ అజిత హెచ్చరించారు. మూడంచెల భద్రత కొనసాగుతుందని, కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. జిల్లా వ్యాప్తంగా సెక్షన్ 144 సెక్షన్ అమలులో ఉంటుందని జిల్లాలోని 137 గ్రామాల్లో పికెటింగ్ కొనసాగుతుందన్నారు.

ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు పూర్తి

భీమవరం (ప్రకాశంచౌక్) : జూన్ 4 నిర్వహించే ఓట్ల లెక్కింపు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. ఏపీ సచివాలయం నుంచి ఆదివారం కౌంటింగ్ ఏర్పాట్లపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా సమీక్ష నిర్వహించారు. కలెక్టరేట్ నుంచి స్థానిక అధికారులు పాల్గొన్నారు. సుమిత్ కుమార్ మాట్లాడుతూ కౌంటింగ్‌కు పూర్తిగా సన్నద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. కౌంటింగ్ పూర్తయిన తర్వాత చేపట్టాల్సిన కార్యకలాపాలపై అన్ని చర్యలు తీసుకున్నామన్నారు.

ఇంటి పన్ను వసూళ్లలో జోరు

జిల్లాలో 82.96 శాతం వసూలు

ఆకివీడు: పల్లెల ప్రగతికి ఆస్తి పన్ను ప్రధాన ఆదాయ వనరు. మార్చి నెలాఖరునాటికి నూరు శాతం పన్నులు వసూలు చేయాల్సి ఉండగా ఈ ఏడాది మార్చి నెలాఖరుకు జిల్లాలోని 409 గ్రామ పంచాయతీల్లో 82.96 శాతం పన్నులు వసూలు చేసి రికార్డు సృష్టించారు. పన్ను వసూళ్లపై కొంత మేర ఎన్నికల ప్రభావం పడింది. అన్ని స్థాయిలో ఉద్యోగులు ఎన్నికల విధుల్లో పాల్గొనడంతో పన్ను వసూళ్లకు కొంత మేర ఆటంకం కల్గింది. అయినప్పటికీ జిల్లాలో దాదాపు రూ.27.27 కోట్లు వసూలు చేశారు. దీనిలో రూ.1.76 కోట్లు పాత బకాయిలున్నాయి. ఇంకా రూ.5.60 కోట్లు వసూలు చేయాలి. జిల్లాలో అత్యధికంగా యలమంచిలి మండలంలో 98.32 శాతం, తణుకు మండలంలో 97.88 శాతం, పోడూరు మండలంలో 97.61 శాతం వసూలు చేశారు. డివిజన్ స్థాయిలో నర్సాపురంలో 91.11 శాతం, భీమవరం డివిజన్‌లో 77.36 శాతం ఇంటి పన్ను వసూలు చేశారు.

ఇంటి పన్నుపై కొత్త జీవో

ఇంటి పన్ను వసూళ్లపై త్వరలో కొత్త జీవో రానుంది. ఏటా ప్రస్తుత పన్నుపై 5 శాతం పెంచుతూ ఆదాయ వృద్ధికి ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. పంచాయతీ అధికారులు ఇష్టానుసారం పన్నులు పెంచే కన్నా ఇదే విధానాన్ని కొనసాగిస్తూ పన్ను వసూలు చేయడం పంచాయతీలకు, లబ్ధిదారులకు శ్రేయస్కరం అనే భావన ప్రజల్లో వ్యక్తమవుతోంది.



గృహేతర పన్నుల్లో తగ్గిన రాబడి

గ్రామాల్లో గృహేతర పన్ను వసూళ్ల ద్వారా రాబడి తగ్గింది. కాల్వ గట్లపై, మంచినీటి చెరువు గట్లపై పచ్చగడ్డి పాటలు, కొబ్బరి చెట్ల ఫలసాయం, చెరువుల్లో చేపలు పట్టుకునే వేలంపాటలు, చెత్త పన్ను, సినిమా హాళ్ళు, ఫంక్షన్ హాళ్లపై పన్ను, సంతలు, తోపుడు బళ్ల వ్యాపారస్తుల ద్వారా పన్ను వసూలు వంటి వాటి ఆదాయం తగ్గిపోయింది. పచ్చగడ్డి వేలం పాటలు తగ్గాయి. కొబ్బరి చెట్ల నుంచి ఫలసాయం అంతంత మాత్రంగానే ఉండటం, సినిమా హాళ్లు మూసివేయడం వంటి వాటిలో గృహేతర పన్ను ఆదాయం తగ్గింది.

వైఎస్సార్‌సీపీదే విజయం

రాష్ట్ర ఎస్సీ కమిషన్ సభ్యుడు చెల్లెం ఆనంద్రప్రకాష్



పాలకొల్లు అర్బన్ : రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ అత్యధిక స్థానాల్లో గెలుపొంది ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రెండోసారి ప్రమాణ స్వీకారం చేస్తారని రాష్ట్ర ఎస్సీ కమిషన్ సభ్యులు చెల్లెం ఆనందప్రకాష్ జోస్యం చెప్పారు. యాళ్లవానిగరువులో ఆదివారం మాట్లాడుతూ.. రాష్ట్రంలో సర్వేలన్నీ వైఎస్సార్‌సీపీ గెలుస్తుందని చెబుతున్నప్పటికీ కూటమి గెలుస్తుందంటూ ఫేక్ సర్వేలతో ప్రజల్లో గందరగోళం సృష్టిస్తున్నారన్నారు.

ఈసీ పారదర్శకంగా ఉండాలి

ఏలూరు (టూటౌన్): ఏపీలో ఎన్నికల కమిషన్ పారదర్శకంగా వ్యవహరించాలని జాతీయ దళిత జేఏసీ ఛైర్మన్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెరికె వరప్రసాదరావు అన్నారు. కేంద్ర ఎన్నికల కమిషన్ నిబంధనలు కూడా కాదని తన ఇష్టారాజ్యంగా పోస్టల్ బ్యాలెట్ ఓట్ల చెల్లుబాటుపై నిర్ణయం తీసుకోవడం అనేక రాజకీయ పార్టీల మనోభావాలకు గొడ్డలిపెట్టు అన్నారు. బరిలో ఉన్న అనేక మంది విజయావకాశాలపై ఈ ప్రభావం పడుతుందని చెప్పారు.

క్లుప్తంగా

గుండెపోటుతో ఉపాధి కూలీ మృతి



ఆలపాటి వెంకట్రావు మృతదేహం

తాడేపల్లిగూడెం రూరల్: ఉపాధి హామీ పథకంలో భాగంగా పనులు చేస్తుండగా ఓ కూలీ గుండెపోటుతో మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని పెదతాడేపల్లి గ్రామానికి చెందిన ఆలపాటి వెంకట్రావు ఉపాధి హామీ పథకంలో కూలీగా పనిచేస్తున్నాడు. రోజు మాదిరిగానే ఆదివారం కూడా వెంకట్రావు ఉపాధి హామీ పనులకు వెళ్లాడు. గ్రామంలో పంట కాలువ పూడిక తొలగింపు పని చేస్తూ గుండెపోటుకు గురై కుప్పకూలిపోయాడు. దీంతో సహచర కూలీలు అతనిని ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు.

చికిత్స పొందుతూ ఉపాధి కూలీ మృతి



మోకా నరసింహ స్వామి (ఫైల్)

నరసాపురం రూరల్: గొంది గ్రామంలో ఇటీవల ఉపాధి హామీ పనులు చేస్తుండగా విషపుటీగలు దాడి చేయడంతో గాయాలపాలైన కూలీ మోకా నర్సింహస్వామి (70) భీమవరంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. గ్రామంలో ఉపాధి హామీ పథకం పనుల్లో భాగంగా పంట బోదెను తవ్వే క్రమంలో అక్కడ ఉన్న చెత్తను తొలగిస్తుండగా విషపుటీగలు ఒక్కసారిగా పెద్ద ఎత్తున దాడి చేయడంతో ఉపాధి కూలీలు యర్రంశెట్టి నాగరాజు, మోకా నరసింహస్వామి గాయాలపాలయ్యారు. తలపైన, వీపు భాగంలో ఎక్కువగా విషపుటీగలు కుట్టడంతో వారిని పాలకొల్లు ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. శుక్రవారం మోకా నరసింహాస్వామిని మెరుగైన చికిత్స కోసం భీమవరంలోని అశోక కిడ్నీ సెంటర్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న ఆయన శనివారం సాయంత్రం మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతునికి భార్య పేములమ్మ, నలుగురు కుమారులు, నలుగురు కుమార్తెలు ఉన్నారు. ఎంపీడీవో ఎం.వెంకటరమణారావు, ఫీల్డ్ అసిస్టెంట్ ఆంజనేయులు, ఏపీవో వై.శ్రీనివాస్, గ్రామ కార్యదర్శి పుల్లాజీ, వీఆర్వో శ్రీనివాస్ నరసింహస్వామి మృతదేహాన్ని సందర్శించారు. ప్రభుత్వ పరంగా మృతుని కుటుంబానికి అందాల్సిన పరిహారం నిమిత్తం ప్రతిపాదనలు అందజేయాలని ఏపీవోకు ఎంపీడీవో సూచించారు. ఇదే ప్రమాదంలో గాయపడిన మరో వ్యక్తి యర్రంశెట్టి నాగరాజు ఆరోగ్య పరిస్థితి మెరుగుపడుతున్నట్లు వైద్యులు పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

భీమవరం: పట్టణంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని ఎల్అండ్‌టీ కాలనీకి చెందిన ఎ.తులసీరామ్, పాలా మాణిక్యమ్మ ఈనెల 1న మోటారుసైకిల్‌పై వెళుతుండగా ఆర్‌టీబీ వద్దకు వచ్చేసరికి గుర్తు తెలియని వ్యక్తి స్కూటీపై వస్తూ వీరిని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో గాయాలపాలైన తులసీరామ్, మాణిక్యమ్మలను ఓ ప్రైవేటు ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. బాధితులిచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ ఎస్సై వెంకటేశ్వరరావు చెప్పారు.

నిషేధిత మందులతో ఆక్వా కుదేలు

- అనుమతులు లేకుండానే దుకాణాల్లో విక్రయాలు
- అప్పడా నిబంధనలు పట్టని వైనం, జిల్లాలో 226 ఆక్వా దుకాణాలు
- యథేచ్ఛగా నిషేధిత యాంటీ బయోటిక్స్ అమ్మకాలు
- రొయ్యల కంటైనర్లను తిరస్కరిస్తున్న యూరోపియన్ దేశాలు
- ఆర్థికంగా నష్టపోతున్న ఆక్వా రైతులు



కైకలూరు శివారులో ఉన్న ఓ రొయ్యల చెరువు



పట్టుబడికి వచ్చిన రొయ్యలు

కైకలూరు: నీలి విప్లవాన్ని నిషేధిత మందులు కలుషితం చేస్తున్నాయి. అవగాహన లేని ఆక్వా రైతులను దుకాణదారులు నట్టేట ముంచుతున్నాయి. ప్రభుత్వం నకిలీ మందులను అరికట్టడానికి కట్టుదిట్టమైన చట్టాలను చేసినా కొందరు నిబంధనలను పాటించడం లేదు. రాష్ట్రంలో పశ్చిమగోదావరి, ఏలూరు, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల నుంచి రెండేళ్ల క్రితం జర్మనీ, ఫ్రాన్స్, బెల్జియం, నెదర్లాండ్స్ దేశాలకు ఎగుమతి చేసిన రొయ్యల కంటైనర్లలో నైట్రో ఫ్యూరాన్ మెటాబోలైట్(ఏఓజడ్) అవశేషాలు ఉన్నట్లు గుర్తించి వెనక్కి పంపారు. ఇంత జరుగుతున్నా యాంటీ బయోటిక్స్‌ను కొందరు వినియోగిస్తుండటం గమనార్హం.

ఏలూరు జిల్లాలో 6,815 హెక్టార్లలో మంచి నీటి చేపలు, 1,345 హెక్టార్లలో ఉప్పునీటి చేపలు, రొయ్యలను సాగు చేస్తున్నారు. సింహభాగం కొల్లేరు పరివాహక గ్రామాల నుంచి ఉత్పత్తులు ఎగుమతి అవుతున్నాయి. అదే విధంగా ఏలూరు జిల్లాలో ఆక్వా దుకాణాలు 226, ఆక్వా ల్యాబ్స్ 33, ఆక్వా ఫీడ్ మిల్స్ 5 ఉన్నాయి. చేపల చెరువుల సాగు అధికంగా ఉన్న ప్రాంతాల్లో ఆక్వా సీడ్స్ అండ్ ఫీడ్స్ పేరుతో ఎటువంటి లైసెన్సులు లేకపోయినా దుకాణాలను నిర్వహిస్తున్నారు. సీడ్ సప్లిమెంట్ పేరుతో రైతులకు వివిధ రకాల మందులను అంటగడుతున్నారు.

యాంటీ బయోటిక్స్ అంటే..

ఆక్వా రంగంలో నిషేధిత యాంటి బయోటిక్స్ వాడకం కారణంగా భూసారం దెబ్బతినడంతో పాటు రొయ్యల ఉత్పత్తులు ఇతర దేశాల నుంచి తిరస్కరణకు గురవుతున్నాయి. అసలు యాంటీ బయోటిక్స్ అంటే కొన్ని జాతుల సూక్ష్మజీవులతో వాటి జీవన ప్రక్రియలో భాగంగా తయారు చేసే రసాయన పదార్థాలు. ఈ రసాయనాలు (యాంటీ బయోటిక్స్) ఆ ఉనికిలో పెరిగే మిగిలిన సూక్ష్మ జీవుల పెరుగుదలను నియంత్రిస్తాయి. అలాంటి యాంటీ బయోటిక్స్ కలిగిన ఆహారాన్ని తీసుకున్నట్లయితే వారికి ఎలర్జీ, విషలక్షణాలు ఏర్పడి, ఆహార నాళాలలో నివసించే సూక్ష్మజీవుల్లో మార్పులు వస్తాయి. యాంటీ బయోటిక్స్ నిరోధిక శక్తి కలిగిన కొత్త సూక్ష్మజీవులు జాతులుగా మారే అవకాశం ఉంది.

అప్పుడా నిబంధనలు గాలికి..

ఆక్వా రంగాన్ని అభివృద్ధి చేయడానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2020లో ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఆక్వాకల్చర్ డెవలప్‌మెంటు అథారిటీ చట్టాన్ని తీసుకొచ్చారు. విచ్చలవిడిగా పెరుగుతున్నా అక్వా మందుల దుకాణాలను నియంత్రించ దానికి ఈ చట్టం ఉపయోగపడుతుంది. ఆక్వా దుకాణం ప్రారంభించాలన్నా, ఇప్పటికే కొనసాగుతున్నా మత్స్యశాఖలో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. ఎటువంటి మందులను విక్రయిస్తున్నారో వివరాలు తెలపాలి. నిబంధనలు అతిక్రమిస్తే రూ.25 వేలు రుసుం, మరోసారి ఇదే తప్పు చేస్తే రూ.50 వేల జరిమానా విధించి, లైసెన్సు రద్దు చేయాలి. అయితే కైకలూరు ప్రాంతంలో దాదాపు అనధికారికంగా 300 దుకాణాలు ఉంటే కేవలం 10 దుకాణాలు రిజిస్ట్రేషన్ చేయించుకోగా, మరో 19 ఆక్వా దుకాణాలకే లైసెన్సు ఉంది. వీరు అనుమతులు లేకుండా మందులు విక్రయిస్తుండటం గమనార్హం.

నిషేధించిన యాంటి బయోటిక్స్ ఇవే..

కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వశాఖ నిషేధిత యాంటీ బయోటిక్స్ జాబితాలను ప్రచురించింది. వాటిలో క్లోరాం ఫెనికాల్, నైట్రో ఫ్యూరాన్ (ఫ్యూరోజోలిడోన్, నైట్రోఫ్యూరోజోన్, ఫ్యూరోల్టోడాన్, నైట్రోఫిరాంటిన్, ఫ్యూరైల్, ఫ్యూమైడ్, నైఫ్యురోటల్, నైఫ్యురాక్సిమ్, నైఫ్యుప్రజైన్) నియోమైసిన్, నాలిడిక్సిక్ యాసిడ్, సల్ఫామిథాక్సజోల్, అరిస్టోలోకియా ఉత్పన్నాలు, క్లోరోఫారమ్, క్లోరోప్రామజైన్, కోల్చిసీన్, డాప్సోన్, డైమిట్రిడాజోల్, మెట్రోనిడాజోల్, రోనిడజోల్, ఇప్రోనిడజోల్, ఇతర నైట్రోమిథాజోన్స్, క్లెన్ బ్యుటరాల్, డై ఇథైల్‌స్టిల్ బిస్ట్రాల్ (డీఈఎస్), సల్ఫోనమైడ్ డ్రగ్స్, ఫోరోక్వినోలోన్స్, గైకోపెప్టైడ్స్ ఉన్నాయి.

> **నోటీసులు ఇచ్చాం**
>
> 
>
> నిబంధనలు పాటించని ఆక్వా మందుల దుకాణాలకు ఇప్పటికే నోటీసులు అందించాం. హైదరాబాద్ నుంచి కొందరు నేరుగా డ్రగ్స్‌ను కొనుగోలు చేస్తున్నట్లు మాకు సమాచారం వచ్చింది. నాణ్యతలేని మందులను ఆక్వారంగంలో ఉపయోగించడం వల్ల ఆక్వా పరిశ్రమ దెబ్బతింటోంది. ప్రతి ఒక్క దుకాణంపై మత్స్యశాఖ ద్వారా తనిఖీలు నిర్వహిస్తాం. నిబంధనలు పాటించని వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. – షేక్ చాంద్ బాషా, మత్స్యశాఖ ఏడీ, కైకలూరు

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న లారీ

- నలుగురు కార్మికులకు గాయాలు
- త్రుటిలో తప్పిన ఘోర ప్రమాదం



అజ్జమూరులో విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన చేపల లోడు లారీ

ఆకివీడు: చేపల ప్యాకింగ్ కోసం చేపల లోడుతో వెళుతున్న ఓ లారీ విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న ఘటనలో నలుగురు కార్మికులకు గాయాలయ్యాయి. కాగా ఈ ప్రమాదంలో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో పెనుముప్పు తప్పింది. వివరాల్లోకి వెళితే.. ఆకివీడు నుంచి అజ్జమూరులోని ఐస్ ఫ్యాక్టరీ వద్దకు చేపల ప్యాకింగ్ కోసం చేపల లోడుతో లారీ బయలుదేరింది. అజ్జమూరు మలుపు వద్ద ప్రమాదవశాత్తు విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. దీంతో విద్యుత్ స్తంభం విరిగిపడటంతో తీగలు తెగి కిందపడ్డాయి. దీంతో ఏబీ స్విచ్ నిలిచిపోవడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. అయితే లారీ పైన ఉన్న నలుగురు కార్మికులకు గాయాలయ్యాయి. దీంతో ప్రాణాపాయం తప్పి, ఘోర ప్రమాదం నుంచి ప్రాణాలతో బయటపడ్డారు. గాయలపాలైన కార్మికులను స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కాగా ఇదే స్థలంలో పది రోజుల క్రితం వృద్ధురాలిని మట్టిలోడు లారీ వేగంగా వచ్చి ఢీకొట్టడంతో ఆమె అక్కడిక్కడే మృతి చెందిన విషయం తెలిసిందే.

ఏజెంట్ల పాత్ర కీలకం

- నిబంధనలపై అవగాహన అవసరం
- రేపు భీమవరంలో ఓట్ల లెక్కింపు
- సెల్‌ఫోన్ తీసుకెళితే అనుమతి రద్దు



భీమవరంలో తణుకు నియోజకవర్గానికి సంబంధించిన లెక్కింపు కోసం చేసిన ఏర్పాట్లు

తణుకు: సార్వత్రిక ఎన్నికల ప్రక్రియలో భాగంగా ఓట్ల లెక్కింపును మంగళవారం భీమవరం విష్ణు కళాశాలలో నిర్వహించనున్నారు. ఆ మేరకు అధికారులు ఇప్పటికే ఏర్పాట్లు పూర్తిచేశారు. ప్రశాంత వాతావరణంలో కౌంటింగ్ నిర్వహించేందుకు పకడ్బందీ చర్యలు చేపడుతున్నారు. ఈ క్రమంలో కౌంటింగ్ రోజున వివిధ పార్టీల ఏజెంట్లు సైతం కీలక పాత్ర పోషించనున్నారు. ఇందుకోసం నిబంధనలపై అవగాహన పెంపొందించుకోవాల్సిన అవసరముందని పలువురు విశ్లేషకులు వెల్లడిస్తున్నారు. ప్రతి అంశాన్ని నిశితంగా పరిశీలించాలని కోరుతున్నారు. ఓట్ల లెక్కింపు సమయంలో అత్యంత అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. తణుకు నియోజకవర్గంలోని 233 పోలింగ్ బూత్‌లకు సంబంధించి 14 టేబుళ్లు ఏర్పాటు చేసి మొత్తం 17 రౌండ్లలో ఫలితాన్ని వెల్లడించనున్నారు.

అవగాహన అవసరం

మంగళవారం ఉదయం 8 గంటలకు కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభం అవుతుంది. తొలుత పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు ప్రారంభించిన తర్వాత 8.30 గంటలకు ఈవీఎంలలో ఓట్ల లెక్కింపు చేపడతారు. అయితే కౌంటింగ్ సమయంలో అభ్యర్థి తరఫున ప్రతినిధిగా వ్యవహరించే ఏజెంట్ల పాత్ర చాలా కీలకంగా ఉంటుంది. కౌంటింగ్ మూడు రోజుల ముందు సాయంత్రం 5గంటలలోపు కౌంటింగ్ ఏజెంట్ల నియామకానికి సంబంధించిన ఫారమ్–18ను సంబంధిత రిటర్నింగ్ అధికారికి సమర్పించాల్సి ఉంటుంది. ఇప్పటికే సంబంధిత ఏజెంట్లకు ఐడీ కార్డులు జారీ చేశారు. కౌంటింగ్‌కు గంట ముందు అపాయింట్‌మెంట్ లెటర్, ఐడీ కార్డును ఏజెంట్లు సంబంధిత ఆర్వోకు అందించాల్సి ఉంటుంది. ఫారం–19 ద్వారా కౌంటింగ్ ఏజెంట్ అపాయింట్‌మెంట్‌ను రద్దు చేసే అధికారం అభ్యర్థి లేదా ఎలక్షన్ ఏజెంట్‌కు ఉంటుంది.

మార్గదర్శకాలు ఇలా..

కౌంటింగ్ ఏజెంట్‌కు 18 ఏళ్లు నిండి ఉండాలి. సాయుధ రక్షణ కలిగిన వారిని అనుమతించరు. కేంద్ర, రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, మేయర్లు, మున్సిపల్, జెడ్పీ చైర్మన్లు, పబ్లిక్‌ంగ సంస్థలు, కార్పొరేషన్ల చైర్మన్లు కూడా ఏజెంట్లుగా కూర్చునేందుకు అనర్హులు. ప్రభుత్వం నుంచి గౌరవవేతనం పొందేవారు, ప్రభుత్వ ఎయిడెడ్ సంస్థల్లో పనిచేసే పార్ట్ టైమ్ ఉద్యోగులు, పారా మెడికల్ స్టాఫ్, రేషన్ డీలర్లు, అంగన్‌వాడీ ఉద్యోగులు పోలింగ్ ఏజెంట్లుగా ఉండకూడదు. ప్రభుత్వ ఉద్యోగులు ఏజెంట్లుగా వ్యవహరిస్తే మూడు నెలల జైలుశిక్ష, జరిమానా లేదా రెండూ కలిపి విధించే అవకాశం ఉంది. సర్పంచ్‌లు, పంచాయతీ వార్డు సభ్యులు, కౌన్సిలర్లు, కార్పొరేటర్లు కౌంటింగ్ ఏజెంట్లుగా కూర్చునేందుకు ఎలాంటి అభ్యంతరం ఉండదు. భారత పౌరసత్వం కలిగిన ఎన్ఆర్ఐ కూడా కూర్చోవచ్చు. ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థి తన గన్‌మేన్‌ను స్వచ్ఛందంగా వదులుకుంటే కౌంటింగ్ హాలులో కూర్చునేందుకు అనుమతిస్తారు. ఒక కౌంటింగ్ హాలులో 14 టేబుళ్లు ఉంటాయి. ఆ మేరకు అభ్యర్థులు తమ ఏజెంట్లను నియమించుకోవచ్చు. పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపునకు అవసరం అని భావిస్తే అందుకోసం వేరే కౌంటింగ్ హాల్లో అదనపు టేబుళ్లు ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. అప్పుడు అభ్యర్థులు అక్కడ అదనంగా మరో కౌంటింగ్ ఏజెంట్‌ను నియమించుకోవచ్చు.

> **నిబంధనలు పాటించాలి**
>
> 
>
> మంగళవారం జరిగే ఓట్ల లెక్కింపును పకడ్బందీగా చేపడతాం. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల వారు ఏజెంట్ల నియామకంలో ఎన్నికల సంఘం నియమ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి. ఈ ప్రక్రియను పక్కాగా పర్యవేక్షిస్తున్నాం. ప్రభుత్వ శాఖల్లో పనిచేసే వారు ఏజెంట్లుగా ఉండకూడదు. పారదర్శకంగా కౌంటింగ్ నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేశాం.
>
> – బీవీ రమణ, నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, తణుకు

సందర్శకులతో సందడిగా బీచ్‌లు



పేరుపాలెం బీచ్‌లో సందర్శకులతో రద్దీగా ఉన్న దృశ్యం

మొగల్తూరు: మండలంలోని కేపీ పాలెం, పేరుపాలెం బీచ్‌లు ఆదివారం సందర్శకులతో కిటకిటలాడాయి. ఆదివారం ఉదయం నుంచి వాతావరణం మబ్బులుగా ఉండటంతో పలు ప్రాంతాల నుంచి బీచ్‌లకు వచ్చే పర్యాటకులతో సందడి వాతావరణం నెలకొంది. చల్లని మబ్బులతో పాటు ఎగిసి పడే అలలతో బీచ్‌కు వచ్చిన సందర్శకులు సముద్రస్నానం చేస్తూ గడిపారు. అనంతరం తీరంలోని ఆలయాలను సందర్శించుకున్నారు.

పశ్చిమ గోదావరిపై ప్రకాశం జట్టు గెలుపు

మూలపాడు (ఇబ్రహీంపట్నం): ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మూలపాడు ఏసీఏ గ్రౌండ్‌లో మూడురోజులుగా జరుగుతున్న సెంట్రల్ జోన్ అంతర్ జిల్లాల సీనియర్ పురుషుల వన్‌డే క్రికెట్ పోటీలు రసవత్తరంగా సాగుతున్నాయి. ఆదివారం పశ్చిమగోదావరి, ప్రకాశం జిల్లాల జట్లు మధ్య మ్యాచ్ జరిగింది. టాస్ గెలిచి బ్యాటింగ్ చేసిన ప్రకాశం జిల్లా జట్టు 43 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 314 పరుగులకు చేసింది. ఆ జట్టు బ్యాట్స్‌మెన్స్ క్రాంతికుమార్ 69 బంతుల్లో 106 పరుగులు, క్రాంతికిరణ్ 124 బంతుల్లో 102 పరుగులు చేయడంతో జట్టు భారీ స్కోర్ చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన పశ్చిమ గోదావరి జిల్లా జట్టు 43 ఓవర్లలో ఐదు వికెట్లు కోల్పోయి 214 పరుగుల చేసి 10 0పరుగుల తేడాతో ఓటమి పాలైంది.

వైభవంగా చక్రస్నానం



శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాసునికి వసంతోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం



గోకుల తిరుమల పారిజాతగిరిలో పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

- పారిజాతగిరిలో కొనసాగుతున్న వెంకన్న బ్రహ్మోత్సవాలు

జంగారెడ్డిగూడెం: గోకుల తిరుమల పారిజాతగిరి శ్రీవేంకటేశ్వరస్వామి వారి దేవస్థానంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాలలో ఆరో రోజు ఆదివారం ఉదయం విశ్వక్సేన పూజ పుణ్యాహవచన కార్యక్రమాల అనంతరం యాగశాలలో బ్రహ్మోత్సవ హోమాన్ని నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాసుని ఉత్సవ మూర్తులకు సుదర్శన పెరుమాళ్‌కు చూర్ణోత్సవం, వసంతోత్సవం, విశేష ద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహించారు. తరువాత భక్తులకు వసంతంతో ప్రోక్షణ చేసి సుదర్శన పెరుమాళ్‌ను ఊరేగింపుగా తీసుకుని వెళ్లి ఆలయ కోనేరులో చక్రస్నాన మహోత్సవం భక్తుల గోవింద నామ స్మరణలతో మంగళ వాయిద్యాల మధ్య అత్యంత వైభవంగా యజ్ఞ బ్రహ్మ పానంగపల్లి సత్య పవన్, ప్రధానార్చకులు నల్లూరు రవికుమార్ ఆచార్యులు, ఋషికేష్, రాఘవాచార్యులు, మొదలగు అర్చక బృందంచే వైభవంగా నిర్వహించారు. అనంతరం అధిక సంఖ్యలో భక్తులు కోనేరులో స్నానమాచరించారు. తర్వాత యాగశాలలో మహా పూర్ణాహుతి నిర్వహించారు. సాయంత్రం శ్రీదేవి భూదేవి సమేత శ్రీనివాసునికి గజవాహనంపై తిరువీధి ఉత్సవం నిర్వహించారు. ఉత్సవం పూర్తయిన తర్వాత ధ్వజ అవరోహణ గావించారు. కార్యక్రమమునకు ఉభయ దారులుగా ధారా రవీంద్ర దంపతులు కోటపోతుల శ్రీనివాస్ దంపతులు, కోటపోతుల బాబీ దంపతులు, బూరుగుపల్లి రవీంద్ర దంపతులు వ్యవహరించారు. ఈ కార్యక్రమ ఏర్పాట్లను కార్య నిర్వహణ అధికారి మానికల రాంబాబు పర్యవేక్షించారు. బ్రహ్మోత్సవ కార్యక్రమాలలో సోమవారం చివరి రోజు సందర్భంగా ఉదయం మూలమూర్తికి అభిషేకము, సాయంత్రం ద్వాదశ ఆరాధన, ద్వాదశ ప్రదక్షణలు, శ్రీ పుష్ప యాగము తదితర కార్యక్రమాలు నిర్వహిస్తారని కార్యనిర్వహణ అధికారి తెలియజేశారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే జైలుకు పంపుతాం


తణుకులో మాట్లాడుతున్న స్పెషల్ ఎస్పీ శ్రీనివాస్


సదస్సుకు హాజరైన రాజకీయ పార్టీల ప్రతినిధులు

తణుకు నియోజకవర్గ స్పెషల్ ఎస్పీ శ్రీనివాస్

తణుకు: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ పురస్కరించుకుని శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా ఎవరైనా ప్రవర్తిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తణుకు నియోజకవర్గ స్పెషల్ ఎస్పీ, తిరుపతి ఎర్రచందనం టాస్క్‌ఫోర్స్ ఎస్పీ పి.శ్రీనివాస్ హెచ్చరించారు. ఆదివారం తణుకులోని వీకే కన్వెన్షన్ హాలులో వివిధ రాజకీయ పార్టీలకు చెందిన ప్రతినిధులు, కార్యకర్తలు, కౌంటింగ్ ఏజెంట్లకు అవగాహన కల్పించారు. మంగళవారం ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో ఎన్నికల నియమావళిని ఉల్లంఘించి వివాదాలు, అల్లర్లు చేసేవారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. తణుకు నియోజకవర్గం నుంచి కేవలం అభ్యర్థుల తోపాటు అనుమతించిన కౌంటింగ్ ఏజెంట్లు మాత్రమే భీమవరం వెళ్లేందుకు అనుమతిస్తామన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా 15 చోట్ల పోలీసు పికెట్లు ఏర్పాటు చేశామన్నారు. రౌడీషీటర్లు, అనుమానితులపై నిత్యం నిఘా ఉంచామన్నారు. ఒక పార్టీకు లబ్ధి చేరూర్చేలా ఎదుటి పార్టీల పట్ల దుష్ప్రచారం చేయడం లేదా దౌర్జన్యాలకు దిగడం చేస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కౌంటింగ్ కేంద్రం లోపలకు వెళ్లే ఏజెంట్లు సెల్‌ఫోన్, ఇతరత్రా ఎలక్ట్రానిక్ వస్తువులు తమతోపాటు తీసుకెళ్లేందుకు అనుమతి లేదన్నారు. ఈ కార్యక్రమంలో తాడేపల్లిగూడెం డీఎస్పీ డీఎస్ఆర్‌వీఎస్ఎన్ మూర్తి, మెరైన్ సీఐ డీవీజే రమేష్‌కుమార్, తణుకు పట్టణ, రూరల్ సీఐలు ఎం.నాగరాజు, జీవీవీ నాగేశ్వరరావు, ఎస్సైలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వరూధిని ఏకాదశి పూజలు


విశేషాలంకరణలో శ్రీకృష్ణపరమాత్మ

తాడేపల్లిగూడెం (టీఓసీ): వరూధిని ఏకాదశిగా పిలిచే వైశాఖ బహుళ ఏకాదశి పురస్కరించుకుని రామచంద్రరావుపేటలోని శ్రీకృష్ణ యోగ ధ్యాన మందిరంలో ఉన్న శ్రీకృష్ణపరమాత్మకు ఆదివారం ఉదయం ఆలయ అర్చకులు ఆదూరి సాయి కిరణ్ పంచామృతాలతో అభిషేకాలు, సహస్రనామార్చనలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు సామూహిక భగవద్గీత పారాయణం చేశారు. మందిర కార్యదర్శి ఇందుకూరి మోహన్‌రాజు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

క్లుప్తంగా

మానవత సంస్థకు రూ.లక్ష విరాళం


మానవత సంస్థకు రూ.లక్ష చెక్కును విరాళంగా అందజేస్తున్న చిట్టూరి సుజాత

తణుకు టౌన్: తణుకు మానవత సంస్థ చేస్తున్న సేవా కార్యక్రమాలను అభినందిస్తూ పట్టణానికి చెందిన దాత చిట్టూరి సుజాత రూ. లక్ష విరాళంగా అందజేశారు. ఆదివారం స్థానిక గమిని ఫంక్షన్ హాలులో జరిగిన మానవత సంస్థ సమావేశంలో సంస్థ సేవా కార్యక్రమాల విస్తరణకు చిట్టూరి సుజాత రూ.లక్ష చెక్కును మానవత సంస్థ జిల్లా శాంతి ర్యాలీ చైర్మన్ గమిని రాంబాబుకు అందజేశారు. ఈసందర్భంగా దాత చిట్టూరి సుజాతను మానవత సంస్థ సభ్యులు అభినందించారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు బాలాజీ, కోశాధికారి అక్కిన కాశీ, డాక్టర్ రామలక్ష్మి, పోతుల శ్రీనివాస్, పులమాల వీరభద్రం, మల్లిపూడి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తక పఠనంపై అవగాహన


వేల్పూరు గ్రంథాలయంలో విద్యార్థులకు పుస్తక పఠనంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

తణుకు టౌన్: విద్యార్థులకు వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా తణుకు రూరల్ మండలం వేల్పూరు గ్రామంలోని శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు పుస్తక పఠనం, స్పోకెన్ ఇంగ్లీష్‌పై శిక్షణ తరగతులను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు యోగాలో శిక్షణ ఇచ్చారు. అనంతరం పుస్తక పఠనం, పుస్తక సమీక్ష, నిర్వహించారు. పుస్తక పఠనంపై విద్యార్థులకు ఆసక్తి కలిగించే వివిధ అంశాలను రీసోర్సు పర్సన్‌లు వివరించారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఎంఈవో కే సత్యనారాయణ, వైఎస్ఎన్ వసంతరావు, బసవేశ్వరరావు, గ్రంథాలయ అధికారి సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి


అత్తిలి ఆశ్రమ ప్రాంగణంలో మొక్కలు నాటుతున్న పీఠం సభ్యులు

అత్తిలి: ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రతి ఒక్కరూ మూడు మొక్కలు నాటాలని శ్రీవిశ్వవిజ్ఞాన విద్య ఆధ్యాత్మిక పీఠాధిపతి ఉమర్ ఆలీషా పిలుపునిచ్చారు. ఉమర్ ఆలీషా రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్టు ఆధ్వర్యంలో 104 ఆశ్రమ శాఖ ద్వారా పీఠం సభ్యులు లక్షలాది మొక్కలు నాటే కార్యక్రమంలో భాగస్వాములు కావాలని ఆయన అంతర్జాలం ద్వారా పిలుపునిచ్చారు. మొక్కలు నాటి వాటిని సంరక్షించాల్సిన బాధ్యత పీఠం సభ్యులు చేపట్టాలన్నారు. పుట్టినరోజు, పెళ్లిరోజు వంటి వేడుకలు సందర్భంగా మొక్కలు పంపిణీ ఒక యజ్ఞంలా నిర్వహించి, భూతాపాన్ని తగ్గించాలన్నారు. కార్యక్రమంలో పీఠం కన్వీనర్ నందం తాతయ్య తదితరులు పాల్గొన్నారు.

శ్రీకొండాలమ్మ ఆలయం వద్ద అఖండ అన్నసమారాధన


అన్నసమారాధనలో పాల్గొన్న భక్తులు

అత్తిలి: బల్లిపాడు రోడ్డులో వేంచేసియున్న శ్రీకొండాలమ్మ అమ్మవారి జాతర మహోత్సవాల్లో భాగంగా ఆదివారం అఖండ అన్నసమారాధన నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలో ఏర్పాటుచేసిన అన్నసమారాధన కార్యక్రమానికి పరిసర ప్రాంతాలనుంచి వేలాది మంది ప్రజలు హాజరై అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఉత్సవ కమిటీ నిర్వాహకుడు దాసరి శ్రీనివాస్ ఆధ్వర్యంలో అమ్మవారి జాతర మహోత్సవాలు జరిగాయి.

ప్రజాభిప్రాయం మేరకే ఎగ్జిట్ పోల్స్

పెనుగొండ: రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ విజయం సాధించబోతుందని ఎగ్జిట్ పోల్స్ ప్రజాభిప్రాయన్ని తెల్చి చెప్పాయని ఏపీఈడబ్ల్యూడీసీ డైరెక్టరు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన కార్యదర్శి కొవ్వూరి వేణుమాధవ రెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు.మంగళవారం వెల్లడయ్యే వాస్తవ ఫలితాలు మరింత మెరుగ్గా ఉంటాయన్న ధీమాను వ్యక్తం చేశారు. సీఎం జగన్ ఐదేళ్ల పాలనలో మహిళలను సమాజంలో ఆత్మగౌరవంతో నిలబెట్టారని అన్నారు. సీఎం జగన్ వల్లే మేలు జరుగుతుందని విశ్వసించిన మహిళలు భారీగా తరలివచ్చి ఓటు వేశారని వివరించారు.

లయన్స్ సేవలు అభినందనీయం


రక్త పరీక్షల శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): లయన్స్‌క్లబ్ ఆఫ్ తాడేపల్లిగూడెం సేవలు అభినందనీయమని పలువురు దాతలు కొనియాడారు. దాత పెరుమాళ్ళ నాగేశ్వరరావు (బద్రి) సహాయ సహకారాలతో క్లబ్ అధ్యక్షులు వంగపండు రామమ్మోహన్‌రావు ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక కడకట్ల జనతా చారిటబుల్ ట్రస్ట్ ఆసుపత్రిలో ఉచిత షుగర్ రక్త పరీక్ష శిబిరం, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. 83 మందికి రక్త పరీక్షలు, ఇతర పరీక్షలు నిర్వహించారు. రీజియన్ చైర్‌పర్సన్ మదన్ మోహన్ అగర్వాల్, డాక్టర్ ఎల్ ఎస్‌వీ నాగేశ్వరరావు, పేరూరి కాశియ్య, సీహెచ్ వెంకటేశ్వరరావు, సంపత్, చిన్నం జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

సంచార వైద్యశాల ద్వారా వృద్ధులకు వైద్యసేవలు

తణుకు టౌన్: తణుకు సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, నిసా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రతి ఆదివారం ఇంటింటికీ వైద్యసేవలు అందించే కార్యక్రమంలో భాగంగా 15 మంది వృద్ధులకు వైద్య సేవలు అందించినట్లు అసోసియేషన్ అధ్యక్షుడు ఏ కరుణాకర్ చౌదరి తెలిపారు. ప్రముఖ నేత్ర వైద్యులు డాక్టర్ హుస్సేన్ అహ్మద్ ఆధ్వర్యంలో సంచార వైద్యశాల ద్వారా జనరల్ వైద్యులు సుంకవల్లి నీలు మహేంద్ర, సాతులూరి అనుస్మిత తణుకు పట్టణం, మండపాక, పైడిపర్రు పరిసర గ్రామాల్లోని మంచం నుంచి లేవలేని వృద్ధుల వద్దకు వెళ్లి అవసరమైన వైద్య పరీక్షలు చేసి వైద్య సూచనలు, సలహాలు అందించారు. వీరవెంకట ఇండియా నెట్‌వర్క్ ఫౌండేషన్ ద్వారా డాక్టర్ కేవీ రావు ఆర్థిక సహాయంతో మందులను ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో కోశాధికారి ఆర్జి భాస్కరరావు, సభ్యులు గిరిజాల నాగేశ్వరరావు, నాదెళ్ల కృష్ణానందం తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీదే విజయం


తూర్పుపాలెంలో కౌంటింగ్ ఏజెంట్ల శిక్షణలో పాల్గొన్న మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు

పెనుగొండ: రాష్ట్రంలోనూ, ఆచంట నియోజకవర్గంలోనూ వైఎస్సార్ సీపీ విజయం సాధించబోతుందని మాజీ మంత్రి, ఆచంట నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు, ఆదివారం తూర్పుపాలెంలో కౌంటింగ్ ఏజెంట్లు శిక్షణలో పాల్గొన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నమ్మకాన్ని నిలబెడుతూ 4న రాష్ట్ర ప్రజలు తీర్పు చెప్పబోతున్నారన్నారు. 155కుపైగా నియోజకవర్గాల్లో వైఎస్సార్ సీపీ విజయం సాధించబోతుందన్నారు. రాష్ట్రంలో అమలు చేసిన సంక్షేమానికి మహిళా ఓటర్లు సైలెంట్‌గా ఓటుతో కృతజ్ఞతలు తెలిపారన్నారు. ఎన్నికల్లో సీఎం జగన్ చేసిన మంచికి ఓటు వేయాలంటూ ప్రచారం నిర్వహించారన్నారు. దీనికి భిన్నంగా చంద్రబాబు ప్రజలను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తూ ప్రచారం చేశారన్నారు. దుష్ప్రచారం, కుయుక్తులపైనే చంద్రబాబు, జనసేన నాయకులు నమ్మకం పెట్టుకున్నారన్నారు, వారి ప్రయత్నం విఫలమైందన్నారు. ఎందరూ కూడగట్టుకొని వచ్చినా సీఎం జగన్ విజయాన్ని ఆపలే కపోయారన్నారు. దీనికి ఉదాహరణ ప్రధాన సర్వేలన్నీ వైఎస్సార్ సీపీ అధికారం చేపట్టబోతుందని తేల్చి చెప్పాయన్నారు. అన్ని ప్రాంతాల్లోనూ విజయం సాధించబోతున్నామన్నారు. వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, మద్దతుదారులు సైలెంట్‌గా ఉన్నారన్నారు. టీడీపీ అత్యుత్సాహం ప్రదర్శిస్తుందన్నారు. వారి నాటకాలు నమ్మాల్సిన అవసరం లేదన్నారు. ఆచంట నియోజకవర్గంలోనూ అత్యంత మెజార్టీతో గెలవబోతున్నామన్నారు. 9న సీఎం జగన్ ప్రమాణ స్వీకారం చేయబోతున్నారని తేల్చి చెప్పారు. కార్యక్రమంలో పెనుమంట్ర ఎంపీపీ కేవీఎస్ నారాయణ రెడ్డి(వాసు), ఇతర నాయకులు పాల్గొన్నారు.

ముగిసిన యోగా తరగతులు


యోగాసనాలు వేస్తున్న విద్యార్థులను పరిశీలిస్తున్న నిర్వాహకులు

పెంటపాడు: తాడేపల్లిగూడెం కోడే వెంకట్రావు మున్సిపల్ హైస్కూల్లో గత 16 రోజుల నుంచి జరుగుతున్న ఉచిత యోగా శిక్షణా తరగతులు ముగిశాయి. ఈ సందర్భంగా కేంద్రప్రభుత్వ ఆయుష్ విభాగం, బుద్ధ యోగా ఫౌండేషన్ ఆధ్వర్యంలో శిక్షకురాలు జి.రూప యోగాలోని మెళకువలను నేర్పించారు. ఈ శిబిరంలో 10 ఏళ్ల నుంచి 60 వయస్సు ఉన్న వారు యోగాలోని మెళకువలను నేర్చుకున్నారు. ఇన్‌చార్జి హెచ్ఎం టి.సూర్యశ్రీనివాస్, యోగా టీచర్ రూప పాల్గొన్నారు.

వేసవి విజ్ఞాన శిబిరాలను వినియోగించుకోవాలి


వేసవి శిక్షణ శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): వేసవి విజ్ఞాన శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని పలువురు విశ్రాంత సభ్యులు పేర్కొన్నారు. తాడేపల్లిగూడెం గ్రేడ్-1 శాఖా గ్రంథాలయంలో ఆదివారం వేసవి శిక్షణ శిబిరం గ్రంథాలయాధికారి వి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. గరికపాటి బాపయ్య శర్మ, ప్రత్తి వీరాస్వామి, జనర్థనరావు, సత్యం, వి.రామాంజనేయులు తదితరులు విద్యార్థులకు పంచతంత్ర కథలు, లెక్కలలో టిప్స్, పొడుపుకథలు, వివిధ సేవలు ఎలా అందించాలి? తదితర విషయాలను నేర్పించారు. యోగా క్లాసులను పి.పాండు నిర్వహించారు.

ఘనంగా ధనకొండాలమ్మ జాతర


ధనకొండాలమ్మ జాతర సందర్భంగా ఏర్పాటు చేసిన గరగల నృత్యాలు


ధన కొండాలమ్మ

యలమంచిలి: అడవిపాలెం, మేడపాడు, పెనుమదం, కొంతేరు, అప్పనచెరువు గ్రామాల సరిహద్దులో పాలకొలను సర్వేశ లింగం పొలంలో వెలసిన ధ నకొండాలమ్మ అమ్మవారి జాతర ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఏడాదిలో ఒకరోజు మాత్రమే జరిగే ఈ జాతర జరుగుతుంది. బాణసంచా కాల్పులు, మంగళ వాయిద్యాల నడుమ గరగల నృత్యాలతో అమ్మవారికి గ్రామోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. అమ్మవారికి కుంభం పోశారు. అనంతరం ఊయల ఉత్సవం చేసి అమ్మవారి ఘటాలను ఆలయ ప్రవేశం చేయడంతో జాతర ముగిసింది. ఐదు గ్రామాలకు చెందిన రైతుల ఆధ్వర్యంలో జరిగిన ఈ జాతరలో ఐదు గ్రామాలతో పాటు పరిసర గ్రామాలకు చెందిన పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. దాతల సహకారంతో జాతరకు వచ్చిన సుమారు ఐదు వేల మంది భక్తులకు అన్నసమారాధన చేశారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి


ఆదర్శ సంస్థలో విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న రొక్కాల నాగ బుజ్జి తదితరులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): విద్యార్థులందరూ అన్ని రంగాల్లో రాణించాలని విజిలెన్స్ అండ్ మోనటరింగ్ సబ్ డివిజన్ కమిటీ సభ్యులు రొక్కాల నాగ బుజ్జి అన్నారు. ఆదర్శ అకాడమిలో ఉచిత స్పోకెన్ ఇంగ్లీషు శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు సంస్థలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో సర్టిఫికెట్స్ అందజేశారు. సంస్థ సెక్రటరీ రొక్కాల ఆశీర్వాదం, ఇంగ్లిష్ ఉపాధ్యాయురాలు ఎస్.నవ్య ప్రియ, ఉపాధ్యాయులు ఎస్‌వీ రావు పర్యవేక్షించారు. రత్నలీల, ఎస్ వీరావు, రెడ్డి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

మైనర్ డ్రెయిన్ల మరమ్మతులు చేపట్టాలి


సమావేశంలో మాట్లాడుతున్న రైతు కార్యాచరణ సమితి నాయకులు

రైతు కార్యాచరణ సమితి నాయకులు

భీమవరం: సార్వా వరిసాగు సీజన్ ప్రారంభమవుతున్న తరుణంలో మైనర్ డ్రెయిన్ల మరమ్మతులపై దృష్టి పెట్టాలని రైతు కార్యచరణ సమితి అధ్యక్ష, కార్యదర్శులు పాతపాటి మురళీరామరాజు, తమ్మినీడి నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ గత ఏడాది అధిక వర్షాల కారణంగా మురుగు కాలువలు పూడుకుపోయి నారుమళ్ల సమయంలో రైతులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారన్నారు. మురుగు నీటి పారుదల శాఖాధికారులు మైనర్ డ్రెయిన్ల మరమ్మతులకు తగు చర్యలు తీసుకుని, ఉపాధిహామీ పథకంలోనైనా పనులు పూర్తి చేయాలని మురళీరామరాజు, నాగేశ్వరరావు కోరారు. అలాగే రైతులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి డ్రెయిన్ల మరమ్మతులకు కృషి చేయాలని కోరారు. డ్రెయిన్ల మరమ్మతుల్లో ఆలస్యం జరిగితే నారుమళ్లు మునిగిపోయి నాట్లు వేయడానికి తీవ్ర జాప్యం కలిగి, పంట నష్టపోతామని వివరించారు. మురుగు నీటిపారుదల అధికారులను సంప్రదించి మైనర్ డ్రెయిన్లలో తూడు, గుర్రపుడెక్క వంటివి తొలగించడానికి కెమికల్స్‌ను పిచికారి చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కాలువలు, డ్రెయిన్ల మరమ్మతులకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసినందున కలెక్టర్ సుమిత్‌కుమార్ త్వరితగతిన పనులు చేపట్టే విధంగా కృషి చేయాలని కోరారు. సమావేశంలో రైతు కార్యాచరణ సమితి నాయకులు కలిదిండి గోపాలకృష్ణంరాజు, కె.కమలాకరశర్మ, ఎం.కృష్ణంరాజు, గొట్టుముక్కల వెంకట భీమరాజు, దండు సత్యనారాయణరాజు, దాసరి సత్యనారాయణ, కోరుకొల్లు మురళీరాజు తదితరులు పాల్గొన్నారు.

కార్మిక చట్టం వర్తింపజేయాలి

ఆకివీడు: రైస్‌మిల్లు కార్మికులకు కనీస వేతన చట్టం, కార్మిక చట్టాల్ని వర్తింపజేయాలని రైస్‌మిల్లు కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బీ.వాసుదేవరెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో రైస్‌మిల్లు కార్మికుల సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మిక చట్టాల్ని సవరించి పదేళ్లు గడుస్తున్నా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని, వెంటనే జీవో విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా సంఘ అధ్యక్షులు జేఎస్వీ. గోపాలన్, మండల అధ్యక్షకార్యదర్శులు పెంకి అప్పారావు, తవిటినాయుడు, పలువురు కార్మికులు పాల్గొన్నారు.

180 మందికి వైద్య పరీక్షలు


జిన్నూరులో వృద్ధుడికి కంటి పరీక్ష నిర్వహిస్తున్న సిబ్బంది

పోడూరు: కిమ్స్, మెడ్ యునైటెడ్ హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో జిన్నూరు గ్రామంలోని ఐడియల్ స్కూల్ ప్రాంగణంలో ఆదివారం అల్లూరి సీతారామరాజు సేవాసమితి సౌజన్యంతో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. కార్డియాలజీ, న్యూరాలజీ, జనరల్ మెడిసిన్, ఎముకలకు సంబంధించిన రోగులకు, కంటి సమస్యలున్నవారికి శిబిరంలో ఆయా విభాగాల సిబ్బంది పరీక్షలు నిర్వహించారు. అవసరమైనవారికి దాత పెన్మెత్స రమణప్రసాదరాజు సౌజన్యంతో ఉచితంగా మందులు అందజేశారు. శిబిరంలో మొత్తం 180 మందికి పరీక్షలు నిర్వహించినట్లు అల్లూరి సీతారామరాజు సేవా సమితి సభ్యులు తెలిపారు. పాలకొల్లు ఏఎంసీ వైస్ చైర్మన్ డీటీడీసీ బాబు శిబిరాన్ని సందర్శించారు. శిబిరంలో సేవలందించిన వైద్యులు, సిబ్బందిని, అల్లూరి సీతారామరాజు సేవా సమితి సభ్యులను ఆయన అభినందించారు. సేవాసమితి అధ్యక్షుడు దండు కృష్ణంరాజు, ఆచంట వెంకట సుబ్బారావు, దండు గోపాలం, సొసైటీ చైర్మన్ జక్కంశెట్టి అప్పాజీ పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

ఆకివీడు: మండలంలోని దుంపగడప శివారు ఉప్పుటేరు వద్ద పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసి ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.7,600 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై బత్తిన నాగబాబు ఆదివారం తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి నిందితులను కోర్టులో హాజరుపరుస్తామన్నారు.

పోలీసుల అదుపులో రౌడీషీటర్లు

ఉండి: ఓట్ల లెక్కింపును పురస్కరించుకుని శాంతి భద్రతలకు విఘాతం కలుగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా ఉండి, ఎన్నార్పీ అగ్రహారం గ్రామాలకు చెందిన ఇద్దరు రౌడీషీటర్లను పోలీసులు ఆదివారం అదుపులోకి తీసుకున్నారు. అవాంఛనీయ ఘటనలు జరిగేందుకు ఆస్కారం లేకుండా కట్టుదిట్టంగా వ్యవహరిస్తున్నట్లు ఎస్సై లక్ష్మణ్ తెలిపారు.

94 శాతం పింఛన్ల పంపిణీ పూర్తి


పింఛన్ పంపిణీ చేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలో జూన్ నెలకు సంబంధించి 94 శాతం పింఛన్ల పంపిణీ పూర్తయిందని ఎంపీడీవో సుబ్రహ్మణ్య శర్మ ఆదివారం తెలిపారు. 3877 మందికి పింఛన్ల సొమ్ము విడుదల కాగా, ఆదివారం నాటికి 3657 మందికి పంపిణీ చేసినట్లు వివరించారు. మిగిలిన పింఛన్ల సొమ్ము విడుదల కాగానే అందజేస్తామన్నారు.

ప్లాస్టిక్ వాడకంతో అన్నీ అనర్థాలే


ప్లాస్టిక్ వాడకం వలన కలిగే అనర్థాలను వివరిస్తున్న దృశ్యం

అత్తిలి: వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా అత్తిలి శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు ఆదివారం ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే అనర్థాలను ఉపాధ్యాయుడు విజయ్‌కుమార్ వివరించారు. భవిష్యత్ తరాల వారికోసం ప్లాస్టిక్‌ను మాని గుడ్డ సంచులను వాడాలన్నారు. వలంటీర్ బి నగేష్, గ్రంథాలయ అధికారి డి కృష్ణారావు, గ్రామీణ గ్రంథాలయాధికారులు ఆర్ దానకృష్ణ, హెచ్‌వీఆర్ కిశోర్‌బాబు, ఎం శ్రీదేవి పాల్గొన్నారు.